క్లుప్తంగా

చిన అప్పనపాలెంలో 'గడప గడపకు' నేడు

బుచ్చెయ్యపేట : మండలంలోని చిన అప్పనపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబులు శుక్రవారం తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని, ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిని ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. స్థానిక సమస్యల్ని తెలుసుకుని, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల నాయకులు, అధికార్లు పాల్గొనాల్సిందిగా కోరారు.

ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ



కింతాడ కేజీబీవీలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థినులతో మాట్లాడుతున్న నాగలక్ష్మి

కె.కోటపాడు : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. కింతాడ గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలను వేగవంతం చేసి, నిర్మాణ ప్రగతి ఆధారంగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమచేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన భవన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. కింతాడ పంచాయతీ గొల్లలపాలెం కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ ఉత్తీర్ణులు కాని విద్యార్థినులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆమె పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రవిబాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్ములు, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

కొలతలు పాటించి రూ.270 వేతనం పొందాలి



నాయుడు చెరువులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ రాము

రోలుగుంట : మండలంలోని కె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన నాయుడు చెరువు లో ఉపాధి పనులను ఆ ఏరియా సాంకేతిక సహాయకుడు బంటు రాము శుక్రవారం పరిశీలించారు. మస్టర్ ప్రకారం 12 జట్లను ఆరా తీశారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎండ దెబ్బ తగలకుండా ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి చేరుకుని 10.30 గంటలకి పని ముగించుకోవాలన్నారు. పనుల్లో కొలతలు పాటించి, ప్రభుత్వం ఇస్తున్న రోజు వేతనం రూ.270 పొందాలని సూచించారు.

దోమల నియంత్రణపై అవగాహన



చొడువాడలో మురుగు కాలువను పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారి మధుసూదనరావు

కె.కోటపాడు : మురుగునీటి నిల్వలో దోమలు వృద్ధి చెంది, మలేరియా వ్యాప్తికి కారణమవుతున్నాయని ప్రజల్లో అవగాహన పెంచాల్సిందిగా జోనల్ మలేరియా అధికారి డాక్టర్ మధుసూదనరావు సిబ్బందికి సూచించారు. చొడువాడ పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న రక్త పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలతో మాట్లాడారు. సచివాలయం పరిధిలో ప్రతి ఫ్రైడేను డ్రై డేగా పాటించాలని తెలిపారు. పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ కేసులపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్‌ఈవో కె.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్లో రోలుగుంట కళాశాల జోరు

- జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల ఉత్తీర్ణతలో 'రోలుగుంట' ముందంజ
- ప్రత్యేక తరగతులు, నిరంతర పర్యవేక్షణే కారణం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలంటే కాస్త చిన్నచూపు. అమ్మఒడి డబ్బులతో సరిపెట్టుకునే ప్రైవేట్ జూనియర్ కళాశాలలు బోలెడు. ప్రభుత్వ హైస్కూళ్లలో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థుల్ని వారు గాలమేసి తీసుకుపోతారు. వారి గాలానికి చిక్కనివారు, ఆ డబ్బుల్ని పిల్లల కోసం మిగుల్చుకుందామనుకునే తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాలలే దిక్కు. ఇలాంటి వారిలో తరగతులకు రెగ్యులర్‌గా హాజరయ్యేది కూడా తక్కువే. ఆర్ట్స్ గ్రూపులైతే మరీ దారుణం. ఇలాంటి పరిస్థితుల మధ్యే కొన్ని ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ ఫలితాలు రాబట్టాయి. అందులో రోలుగుంట జూనియర్ కళాశాల ముందంజలో నిలిచింది.

రోలుగుంట: నాడు-నేడు పథకంతో జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు కార్పొరేట్ కళాశాలల్ని మించిన వసతులు సమకూర్చుకున్నాయి. ఉత్తమ బోధన అందించడంతో పాటు ఉత్తమ ఫలితాల సాధనలో పోటీ పడుతున్నాయి. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రోలుగుంట జూనియర్ కళాశాల 63 శాతం ఉత్తీర్ణతతో అనకాపల్లి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, సప్లిమెంటరీలో మరింత ఉత్తమ స్థాయి ఫలితాలు సాధించేందుకు ప్రిన్సిపాల్ సహదేవుడి నేతృత్వంలోని అధ్యాపక సిబ్బంది కృషి చేస్తోంది.



కళాశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణ

ఏటా పెరుగుతున్న ఉత్తీర్ణత

2021-22 విద్యా సంవత్సరంలో కళాశాల నుంచి ఫస్టియర్ అన్ని గ్రూపులు కలిపి 168 మంది పరీక్షలకు హాజరుకాగా 70(42 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఫస్టియర్ 130 మందిలో 82(63 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్లో గతేడాది 218 మంది పరీక్షల కు హాజరుకాగా, 112(51 శాతం) మంది ఉత్తీర్ణులవ గా, ఈ ఏడాది 128 మందికి గాను 75(59 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ ఫలితాల తర్వాత ఉత్తీర్ణత శాతం మరింతగా పెరిగే అవకాశముంది.

ప్రత్యేక తరగతులు

కళాశాలలో పరీక్షలకు కనీసం మూడు మాసాల ముందు నుంచి రోజూ ఉదయం, సాయంత్రం అదనంగా గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో సంబంధిత అధ్యాపకుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్ జరుగుతాయి. ఈ ఏడాది తప్పిన విద్యార్థులకు ఈ నెల 1 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి సిబ్బంది బోధనాతీరుతో మండలంతో పాటు నర్సీపట్నం, బుచ్చియ్యపేట, రావికమతం మండలా నుంచి కూడా విద్యార్థులు కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగే అవకాశమున్నట్టు సిబ్బంది చెప్తున్నారు.

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు

కళాశాలలో పని చేస్తున్న సబ్జెక్ట్ అధ్యాపకులు ఉత్తీర్ణత శాతం పెరిగేలా, మంచి ఫలితాలు సాధించాలనే దృక్పథంతో బోధన అందిస్తున్నారు. వారందరి సమష్టి కృషితోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ ఇంటి వద్ద పిల్లల చదువుపై కాస్త శ్రద్ధ పెడితే మరింత ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

– జి.సహదేవుడు, ప్రిన్సిపాల్

జగనే మా పెద్ద కొడుకు

- గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంతో స్థానికులు



చుక్కపల్లిలో గడప గడప కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

చీడికాడ : జగన్‌బాబే మా పెద్ద కొడుకు. మమ్మల్ని కంటికి రెప్పలా సాకుతోంది ఆయనే. ఆయన అందిస్తోన్న సంక్షేమ లబ్ధితోనే మా బతుకులు సాఫీగా సాగిపోతున్నాయి.. అంటూ చుక్కపల్లికి చెందిన పింఛన్ లబ్ధిదారులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వద్ద తమ ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని చుక్కపల్లిలో 396 కుటుంబాలను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలిసి, కుటుంబాల వారీగా ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించారు. తొలుత ఆయన బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం తమదని, అందుకే కులం, మతం, పార్టీ, ప్రాంతం, వర్గ భేదం లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు తెలిపారు. సంక్షేమ ఫలాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు.

స్థానికంగా మురుగునీటి కాలువల సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. రూ.1.05 కోట్లతో చేపట్టిన ఇంటింటి కుళాయి పనుల్ని పరిశీలించారు. రూ.4.05 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. చుక్కపల్లి-కొత్తచుక్కపల్లి రోడ్డుకు రూ.1.15 కోట్లు, బోయిలకింతాడ-చుక్కపల్లి రోడ్డుకు రూ.1.60 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. గత నాలుగేళ్లలో గ్రామంలోని 2,652 మందికి రూ.10.06 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన బూడి పిల్లలతో కాసేపు ముచ్చటించారు. అయితే అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఐసీడీఎస్ పీవో, సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మీటర్ ఏర్పాటు చేయ్యాలంటూ రూ.2,800 నగదు తన జేబులో నుంచి తీసిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ, ఎంపీటీసీ సుంకర వెంకటలక్ష్మి, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకిరాం, చీడికాడ, దేవరాపల్లి పార్టీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బురే బాబురావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు యర్రా అప్పారావు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, పార్టీ నేతలు మజ్జి దేవానంద్, బాయిశెట్టి వెంకటరమణ, సకలా రమణ, సత్తిబాబు, శీరంరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన ఉపాధ్యాయులు, పెద్దలు

చోడవరం రూరల్ : పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. జుత్తాడ ప్రవల్లిక(564), మదపాక అయ్యప్ప(538) కోసూరు హర్ష(530), సాలాపు శశికుమార్(525), ధర్మిశెట్టి సాయి(512), అరుకు విష్ణువర్ధన్(511) లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.జె. ప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దాడి పార్వతిజగదీష్, గాంధీగ్రామం సర్పంచ్ గాడి అప్పారావు, ఎంపీపీ గాడి కాసులమ్మ, పాఠశాల సిబ్బంది సత్కరించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఆ పాఠశాల విద్యార్థులను సత్కరించి, అభినందించారు. సర్పంచ్ ఆదిగణపతినాయుడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో సత్వర పరిష్కారం



తహసీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

నాతవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం ద్వారా అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తహసీల్దార్ పి.కనకారావు అన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై మండల స్థాయి అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. విభాగాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై చర్చించారు. ఇద్దరు ఫిర్యాదుదారులతో మాట్లాడి, పరిష్కారానికి సూచనలు చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం అన్ని వర్గాల ప్రజలకు ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ, ఎంఈవో తాడి అమృతకుమార్, వ్యవసాయాధికారి శైలజ, విద్యుత్ శాఖ, హౌసింగ్ జేఈలు చంద్రమౌళి, జోగారావు, ఉపాధి హమీ పథకం ఏపీవో చిన్నారావు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్నప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ. పార్టీ పరిశీలకుడు కోలా గురువులు

చోడవరం : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.45 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సచివాలయం, వలంటీర్ల పనితీరును ఆరా తీశారు. అర్హతే కొలమానంగా పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్లన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళాసాధికారత ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని కొనియాడారు. అడుగడుగునా ధర్మశ్రీకి ప్రజలు ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా పలువురు తమకు ఇళ్లను మంజూరు చేయాలని కోరగా, అర్హులైన వారికి జగనన్న లే అవుట్లలో ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కోలా గురువులు మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్‌కు మించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెనతో పేదలకు ఉత్తమ విద్య అందించేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరుచోళ్ల గంగాభవానీ గణపతినాయుడు, ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, ఎంపీటీసీలు సంద్రాన వీరన్న, షేక్ అబ్దుల్ రెహమాన్, పాఠశాల కమిటీ చైర్మన్లు బూతనాథుని రామారావు, కొప్పాక వరహాలనాయుడు, ఎస్వీ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో మూడో విడత రీ సర్వే

నాతవరం : మండలంలో జగనన్న భూ రీసర్వేకు మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక చేసినట్టు తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మండల సర్వేయర్ బాలరెడ్డి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భూరీసర్వే ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. రెండు విడతల్లో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జగనన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. మూడో విడతలో గన్నవరం, చెర్లోపాలెం, ఎం.బెన్నవరం గ్రామాల్లో సర్వే జరపనున్నట్టు పేర్కొన్నారు. రీసర్వే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించి, వారి సహకారంతోనే సర్వే పూర్తి చేయాలని సూచించారు. రైతులు సంతృప్తి చెందేలా, అవకతవకలకు తావులేకుండా, నిబంధనల మేరకు పని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, సర్వేయర్లు వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇంటి వద్ద నిలిపిన ఆటో చోరీ

మాకవరపాలెం : ఇంటి బయట పెట్టిన ఆటో చోరీకి గురైంది. మండలంలోని భీమబోయినపాలెం గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్ ఎప్పటిలాగే గురువారం తన ఆటోను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఉదయం నిద్రలేచి చూసేసరికి ఆటో కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు.

రెండు గ్రామాల్లో హౌసింగ్ డే

మాడుగుల రూరల్ : జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను మండల ప్రత్యేకాధికారి జి.ప్రభాకరరావు కోరారు. కె.జె.పురం, వంటర్లపాలెం లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణంలో ఏమైనా సమస్యలున్నా, బిల్లుల చెల్లింపు ఆలస్యమైనా తనను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో పి.ఎస్.ఎల్. మీనాకుమారి, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణ, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

చుక్కపల్లిలో 'గడప గడపకు' నేడు

చీడికాడ : మండలంలోని చుక్కపల్లి పంచాయితీలో 2వ రోజైన శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల, యువజన విభాగం అధ్యక్షులు రాజుబాబు, గొల్లవిల్లి స్వామినాయుడు శుక్రవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని, పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, అధికారులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు



కాశీపురంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్, ఎంపీడీవో సుబ్బలక్ష్మి

దేవరాపల్లి : జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాల్సిందిగా మండల ప్రత్యేక అధికారి వి.రవీంద్రనాథ్ లబ్ధిదారులను సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా కాశీపురం లేఅవుట్ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మితో కలిసి శుక్రవారం పరిశీలించారు. గ్రామాల్లోని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటికే విద్యుత్, నీటి సదుపాయం కల్పించామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకువస్తే, తక్షణమే పరిష్కరిస్తామని లబ్ధిదారులకు భరోసానిచ్చారు. ఇళ్లు నిర్మించిన లబ్ధిదారులకు పేమెంట్లు సైతం ఎప్పటికప్పుడు చెల్లించేందుకు హౌసింగ్ శాఖ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఇంకా ప్రారంభించని వారు తక్షణమే నిర్మాణాలను ప్రారంభించాలని కోరారు. అనంతరం చంద్రయ్యపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని చిన్నారులను, తల్లిదండ్రులను ఆరా తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ భవ్యతేజ, ఉపాధి హామీ ఏపీవో డి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' మానిటరింగ్ టీం ఏర్పాటు



తహసీల్దార్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన పర్యవేక్షణ బృందం

రావికమతం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం విజయవంతానికి మండల స్థాయిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల మానిటరింగ్ టీం శుక్రవారం ఏర్పాటైంది. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఈ టీం సభ్యులు పరిశీలించి తక్షణం గ్రామ స్థాయిలో విచారించి, పరిష్కారానికి కృషి చేయనున్నారు. ఆపై నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. బృందంలో తహసీల్దార్‌తోపాటు ఎంపీడీవో వెంకన్నబాబు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, పలు శాఖల అధికార్లు ఉన్నారు.

వేసవి దుక్కులు ప్రారంభం



పీపీ అగ్రహారంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు

మాకవరపాలెం : ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు వేసవి దుక్కులను ప్రారంభించారు. ఏటా ఏప్రిల్, మే నెలలో రైతులు వేసవి దుక్కులు చేస్తుంటారు. ఇటీవల భారీ వర్షాలు వేసవి దుక్కులకు అనుకూలంగా మారాయి. దీంతో మండలంలోని కొండల అగ్రహారం, పైడిపాల, లచ్చన్నపాలెం, తామరం, పెద్దిపాలెం, పి.పి.అగ్రహారం గ్రామాల్లో రైతులు దుక్కులు చేస్తున్నారు. ఇప్పటికే పశువుల గెత్తాన్ని పొలాల్లో కుప్పలుగా వేసుకున్న రైతులు భూముల్లో కలియ దున్నుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు



లచ్చన్నపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం : హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని లచ్చన్నపాలెంలో ఏటా హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం హనుమాన్ జయంతి నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు పూజలు, హోమాలు చేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రవీంద్రనాథ్

దేవరాపల్లి : ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చోడవరం వ్యవసాయశాఖ ఏడీఏ వి.రవీంద్రనాథ్ కోరారు. మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ అధ్యక్షతన దేవరాపల్లి వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమా వేశంలో ఆయన మాట్లాడారు. పంట భూముల్లో పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులు వినియోగిస్తే పురుగుల బెడద నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. 10 కేజీల జీలుగు ధర రూ.970 కాగా రైతు రూ.395 చెల్లిస్తే చాలన్నారు. జనుము 10 కిలోలు రూ.840 కాగా, రూ.420, పిల్లి పెసర 8 కేజీల ధర రూ.970 కాగా రైతు రూ.485 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులను వినియోగించుకోండి

రావికమతం : ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఈ నెల 1 నుంచి కొత్తకోట జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఎంపీడీడివో వెంకన్నబాబు శుక్రవారం పరిశీలించారు. హాజరవుతున్న విద్యార్థులు, తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. సమస్యలేమైనా ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏ పాఠ్యాంశం అర్థం కాకున్నా.. మళ్లీ మళ్లీ అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రత్యేక తరగతుల్ని సద్వినియోగం చేసుకుని, అందరూ ఉత్తీర్ణులు కావాలని అభిలషించారు. అనంతరం ప్రిన్సిపాల్ సాయికుమార్‌తో మాట్లాడారు.

అడ్మిషన్ల కోసం కొత్తకోట కళాశాల ప్రచారం



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న కళాశాల అధ్యాపకులు

రావికమతం : ఉత్తమ ఫలితాలకు, క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచిన కొత్తకోట జూనియర్ కాలేజీలో పిల్లలను చేర్పించాలంటూ కాలేజీ అధ్యాపక బృందం పది పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విస్తృత ప్రచారం చేస్తున్నారు. కొత్తకోట జూనియర్ కాలేజీలో ఈ ఏడాది మేటి ఫలితాలు వచ్చాయి. 907, 904, 901, 898 మార్కులతో పాటు 850 దాటి చాలా మంది మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. క్రమశిక్షణతో కూడిన బోధన జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. సౌకర్యాలు, బోధనా విధానం, ఫలితాలను చెప్తూ, విద్యార్థుల్ని చేర్పించాల్సిందిగా ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సాయికుమార్‌తో పాటు అధ్యాపక బృందం కొత్తకోట, దొండపూడి గ్రామాల్లో శుక్రవారం ప్రచారం చేశారు.

జల్ జీవన్ మిషన్ పనులకు శ్రీకారం



ఇంటింటా కుళాయి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ జామి రమణబాబు

మాడుగుల రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జల్ జీవన్ మిషన్‌లో ఇంటింటి కుళాయిలు, మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి కేజే పురంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, ఉప సర్పంచ్ కాళ్ల కోటమ్మ భూమి పూజ చేశారు. ఈ పనులకు రూ.3.30 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో ఇంటింటి కుళాయిల ఏర్పాటు, 40 వేల లీటర్ల సామర్థ్యమున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కాళ్ల రాము, ఆడారి కన్నారావు, మళ్ల కన్నబాబు, యల్లపు శ్రీనివాసరావు, కాళ్ల జగన్, అమ్మతల్లినాయుడు మాస్టర్, సూరిశెట్టి అచ్చింనాయుడు, స్థానిక ఇంజినీరింగ్ సహాయకులు స్వాతి, కిరణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ఏసీఎం మందు పిచికారీని పరిశీలిస్తున్న రామనాథం

రావికమతం : తరచూ మలేరియా బారినపడే గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టి, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్టు హెల్త్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.టి.రామనాథం తెలిపారు. ధర్మవరంలో చేపట్టిన ఏసీఎం మందు పిచికారీని శుక్రవారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని మైదాన, గిరిజన ప్రాంతాల్లో వైరల్ జ్వరాల దృష్ట్యా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. రావికమతం మండలంలోని 29 మైదాన గ్రామాల్లో ముందస్తుగా దోమల నివారణ మందు పిచికారీ చేయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి కె.వరహాలు దొర, సబ్‌యూనిట్ అధికారి మురళీకృష్ణ, హెల్త్ సిబ్బంది మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.